www.prajanaava.in
Telugu Daily


# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar
హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 134 | శుక్రవారం | 25.10.2024



## కాళేశ్వరం డైరెక్షన్ కేసీఆర్‌దే!

- రివ్యూ చేసే వరకు మాకేం ఇన్వాల్వ్‌మెంట్ లేదు
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందుకు మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు
- డీపీఆర్ నిర్ణయంపై ప్రశ్నించిన కమిషన్
- నిజాలు తేల్చాలి.. నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వార్నింగ్
- 2016లో సమీక్షకు పిలిచే వరకు తమకేం తెలియదని మాజీ ఈఎన్సీ స్పష్టం
- మూడు బ్యారేజీలను వ్యాప్కోస్ ఫైనల్ చేసిందన్న వెంకటేశ్వర్లు

2

## మా భర్తలు పోలీసులా.. కూలీలా

### రోడ్డెక్కిన పోలీస్ భార్యలు

- భర్తల కోసం పోలీస్ బెటాలియన్ల ఎదుట భార్యల ధర్నా
- టీజీఎస్పీ హఠావో.. ఏక్ పోలీస్ బనావో అంటూ నినాదాలు
- ఇవ్వకుండా మాకు దూరం చేస్తున్నారంటూ ఆగ్రహం
- పోలీస్ కుటుంబాలకు కేటీఆర్ సంఘీభావం



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**
తెలంగాణలో పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. బెటాలియన్ కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న భర్తల కోసం భార్యలు ధర్నాకు దిగారు. తెలంగాణ వ్యాప్తంగా పలు నగరాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. టీజీఎస్పీ హఠావో.. ఏక్ పోలీస్ బనావో అంటూ నినాదాలు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పోలీస్ విధానాలను తెలంగాణలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటలకు మించి బెటాలియన్ కానిస్టేబుళ్లకు డ్యూటీ వేస్తుండటాన్ని నిరసిస్తూ ధర్నాకు దిగారు. నెలలో నాలుగు రోజులు మాత్రమే సెలవు ఇస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. తమ భర్తలతో కూలీ

మిగతా 2లో..

## దీపావళి బోనస్ రూ.93,750



- సింగరేణి కార్మికులకు ప్రభుత్వం బోనస్ ప్రకటన
- రూ. 358 కోట్లు ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి
- గతేడాది కన్నా రూ. 50 కోట్లు అధికంగా రిలీజ్ చేశామని వెల్లడి
- నేడు బ్యాంక్ అకౌంట్లలో నగదు జమ

2

## జానీ మాస్టర్‌కు బెయిల్

- అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ పై లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్
- రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- నేడు జైలు నుంచి విడుదల



2

## తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

- బెయిల్ కోసం సుప్రీంను ఆశ్రయించిన తిరుపతన్న
- కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు ఆదేశం
- ఛార్జ్‌షీట్ ఫైల్ చేసి మూడు నెలలైనా హైకోర్టు బెయిల్ ఎందుకు నిరాకరించిందన్న ధర్మాసనం
- తదుపరి విచారణ నవంబర్ 7కు వాయిదా



2

## ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



- నిబంధనలు ఉల్లంఘిస్తే తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తా
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

2

## అవసరమైతే జైలుకెళ్తా

- ప్రజల కోసం ఎందాకైనా పోరాడుతాం
- రేవంత్ రెడ్డి అయ్యకు కూడా భయపడ
- కాంగ్రెస్ నేతలను ఉరికించి కొట్టే రోజులు వస్తున్నాయ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చెయ్యొద్దు
- అలాంటి వారి పేర్లు రాయండి మిత్తితో సహా చెల్లిద్దాం
- ఆదిలాబాద్ 'బీఆర్ఎస్ రైతు పోరుబాట' కార్యక్రమంలో కేటీఆర్



**ప్రజానావ, ఆదిలాబాద్:**
ప్రజల కోసం ఎందాకైనా పోరాడుతానని, రైతుల కోసం జైలుకైనా వెళ్తానని మాజీ మంత్రి కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అయ్యకు కూడా భయపడనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలే తిరగబడి ఉరికిచ్చి కొట్టే రోజులు తొందర్లోనే ఉన్నాయని

మిగతా 2లో..

## తుస్సుమంటాయా? పేల్తాయా?

- రెండ్రోజుల్లో పొలిటికల్ బాంబులు పేల్తాయన్న మంత్రి పొంగులేటి
- పూర్తి ఆధారాలతో అన్ని ఫైళ్లు సిద్ధమయ్యాయని కామెంట్
- అరెస్ట్ కాబోతున్న గత ప్రభుత్వంలోని కీలక నాయకులు ఎవరు?
- కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ధరణి.. ఏ స్కామ్ లో చర్యలుంటాయి?
- అక్రమార్కులకు చర్లపల్లి జైలులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తానన్న రేవంత్ రెడ్డి
- సర్కారు ఏర్పడి10 నెలలు పూర్తయినా.. ఇప్పటి వరకు చర్యలు శూన్యం
- ఇప్పుడైనా చర్యలుంటాయా? ఆసక్తిగా చూస్తున్న జనం

2

## సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా?

- పేదల ఉసురు మంచిది కాదు..
- మేము బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



2

## హైదరాబాద్ నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు

- వరంగల్‌లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్
- యాదాద్రి వరకు ఎంఎంటీఎస్
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



2

## పెండింగ్ డీఏలకు గ్రీన్ సిగ్నల్?



2

- టీజీవో ఉద్యోగుల బృందంతో సీఎం రేవంత్ సమావేశం
- పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, హెల్త్ కార్డులు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు అంశాలపై చర్చ
- చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం



## సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా?

**ప్రజానావ, హైదరాబాద్:**

గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరిట క్రమబద్ధీకరణ చేసిన భూములనే బీఆర్‌ఎస్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదలకు విక్రయించారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇప్పుడు ఆ బీఆర్‌ఎస్ పార్టీ నేతలే మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. డీపీఆర్ లేకుండా మార్కింగ్ ఎలా చేస్తావని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఆయనను ఎన్నుకుంటే పేదల బతుకు ఇట్లా ఆగం చేస్తావా? అని మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికని ప్రశ్నించారు. మూసీ విషయంలో ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును తమ పార్టీ ఖండిస్తోందన్నారు. ఈ ప్రభుత్వం చెరువులను అన్నింటినీ క్లీన్ చేస్తే అభినందిస్తామన్నారు. డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చూడాలన్నారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, అందులో విష రసాయనాలు కలుస్తున్నాయన్నారు.

## జానీ మాస్టర్‌కు బెయిల్




**ప్రజానావ, హైదరాబాద్:**

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. తెలంగాణ హైకోర్టు జానీ మాస్టర్‌కు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లేడీ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్‌ను నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఆయన గత రెండు వారాలుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.కాగా, ఇటీవలే జానీ మాస్టర్ తనకు వచ్చిన జాతీయ అవార్డును తీసుకునేందుకు రంగారెడ్డి జిల్లా ఫోక్సో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకుని అక్టోబర్ 6 నుంచి అక్టోబర్ 9 వరకు నాలుగు రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, అనూహ్యంగా ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసు నమోదు కావడంతో జానీ మాస్టర్‌కు రావాల్సిన నేషనల్ అవార్డును రద్దు చేశారు. ఆ తదనంతర పరిణామాలతో ఆయన బెయిల్ కూడా రద్దు అయింది. ఇక చేసేదేమి లేక కేసులో ఇక మధ్యంతర బెయిల్ తీసుకోనని జానీ మాస్టర్ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఆ మెమోపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం ఆయనకు ఇవాళ రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది.

## ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

**ప్రజానావ, ఖైరతాబాద్:**

నగరంలో దీపావళి పండగకు బాణసంచా విక్రయించే దుకాణాదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. రిటైల్ దుకాణాలకు రూ.11 వేలు, హోల్ సేల్ దుకాణాలకు రూ.66 వేలు లైసెన్స్ ఫీజు నిర్ణయించినట్లు కమిషనర్ ప్రకటించారు. బాణ సంచా దుకాణాలను ఫుట్‌పాత్‌లు, జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దని సూచించారు. అదేవిధంగా స్టాల్స్‌కు ఏర్పాటు చేసే విద్యుత్‌కు సంబంధించి నాణ్యమైన పరికరాలు ఉపయోగించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే అందుకు దుకాణాల యజమానులే బాధ్యత వహించాలని కమిషనర్ తెలిపారు. కాలనీలు, బస్తీలకు దూరంగా మైదానాలు, పెద్ద హాల్స్‌లో తగిన ఫైర్ సేఫ్టీతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి స్టాల్ వద్ద చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్‌ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. తాత్కాలిక ట్రేడ్ ఐడెంటిఫికేషన్ నంబర్ కోసం సిటిజన్ సర్వీస్ సెంటర్, జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ www.ghmc.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులు, న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని సూచించారు.కొన్నిటపాసుల అమ్మకాలపై నిషేధం ఉందని, వాటి అమ్మకాలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాదారుల తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

# కాళేశ్వరం డైరెక్షన్ కేసీఆర్‌దే!



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

కాళేశ్వరం కమిషన్ విచారణకు గురువారం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయనను విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. వెంకటేశ్వర్లును రెండు విడుతలుగా విచారించిన కమిషన్.. ఆయనపై కీలక ప్రశ్నలు వేసింది. టెక్నికల్ అంశాల తర్వాత డీపీఆర్ ఎవరు అప్రూవల్ చేశారని కమిషన్ ప్రశ్నించగా.. మాజీ సీఎం కేసీఆర్ చేసినట్టు తెలిసింది. డీపీఆర్ అప్రూవల్ మాజీ ముఖ్యమంత్రి చేశారని కమిషన్ ముందు మాజీ ఈఎన్సీ చెప్పారు. డీపీఆర్‌లు వేరువేరుగా చేశారా? ఒకే డీపీఆర్ ఉందా అని కమిషన్ ప్రశ్నించింది. మూడు బ్యారేజీలకు వేరువేరుగా ఒకసారి.. మొత్తం కలిపి మరోసారి రెండు డీపీఆర్లు ఉన్నాయని వెంకటేశ్వర్లు తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ కింద కోల్బెడ్ టెస్టులు నిర్వహించారని, కోల్బెడ్ ఆనవాళ్లు గుర్తించినట్లు రిపోర్టులు ఉన్నాయని కాళేశ్వరం కమిషన్ పేర్కొంది. బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించింది కమిషన్. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే నీళ్లను నిల్వ చేసినట్లు మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు కమిషన్ ముందు చెప్పారు. ప్రతిరోజు రెండు టీఎంసీలు ఎత్తిపోసేందుకు రూ. 40 వేల కోట్ల వరకు ఉండే ఖర్చు 3 టీఎంసీలు అయ్యేసరికి డబుల్ ఎలా అయిందని కమిషన్ ప్రశ్నించింది. కేవలం అదనంగా 2 లక్షల ఎకరాల కోసం అన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలా అని ప్రశ్నించింది. ప్రాణహిత చేవెళ్ల వద్ద రెండు లిఫ్టులు తక్కువ విద్యుత్ ఖర్చు కాదని.. కాళేశ్వరం మూడు లిఫ్టులు ఎక్కువ విద్యుత్ ఖర్చులు ఎందుకు చేశారని ప్రశ్నించింది..? కాళేశ్వరం ప్రాజెక్టు నార్మల్ ప్రాజెక్టు కాదు.. ఇది ప్రత్యేకమైన గ్యారేజీ అని మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. జ్యుడీషియల్ కమిషన్ ఎదుట హాజరైన విషయాన్ని గుర్తు పెట్టుకొని నిజాలు, డాక్యుమెంట్ ఆధారాలు మాత్రమే చెప్పాలని ముందు హెచ్చరించింది. నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది.

# దీపావళి బోనస్ రూ.93,750

**ప్రజానావ, హైదరాబాద్:**

సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి బోనస్ ప్రకటించింది. బోనస్ కింద రూ. 358 కోట్లు విడుదల చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రతి కార్మికుని ఖాతాలో నేటి నుంచి రూ. 93,750 జమ అవుతాయని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించడం ఆనందంగా ఉందని భట్టి ట్వీట్ చేశారు. బోనస్ ప్రకటించడంపై సింగరేణి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దీపావళి బోనస్ కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



**కార్మికులకు సంతోషంగా బోనస్ ప్రకటిస్తున్నాం...**

2023 24 ఏడాదిలో సింగరేణికి రూ. 4701 కోట్లు లాభం వచ్చిందని ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో సింగరేణి కార్మికులకు రూ. 796 కోట్లు బోనస్‌గా ప్రకటిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ. 1.90 లక్షలు బోనస్ వస్తుందన్నారు. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్ ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేగాక, ఒప్పంద ఉద్యోగులకు కూడా ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది కంటే రూ. 20 వేలు అదనంగా బోనస్ ప్రకటించామని, సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. సింగరేణిలో మొత్తం 41,837 మంది పర్మినెంట్ ఉద్యోగులున్నారు. వీరితోపాటు కాంట్రాక్ట్ వర్కర్లుగా 25వేల మంది పనిచేస్తున్నారు.

# హైదరాబాద్ నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు

**ప్రజానావ, హైదరాబాద్:**

హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు మరిన్ని వందే భారత్ రైళ్లు నడపుతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా అయిదు వందే భారత్ రైళ్లు నడుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ గురువారం తన చాంబర్‌లో ఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కిషన్ రెడ్డితో పాటు ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్ రావులు పాల్గొన్నారు. అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని తెలిపారు. అమృత్ పథకం కింద పలు రైల్వే స్టేషన్లను ఆధునీకీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ. 650 కోట్లతో రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్ ను పెంచామన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా..**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ను రూ.720 కోట్లతో అధునికీకరణ చేస్తున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసులను పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. దేశంలోనే సౌత్ సెంట్రల్ రైల్వేలో పనులు అతి వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ లైన్‌లు ఎలక్ట్రిఫికేషన్ పరిధిలో జరగుతున్ననాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే.. వరంగల్ రైల్వే మ్యానుఫ్యాక్చర్ యూనిట్ ఏర్పాటుపై కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేయబోయే మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌లో.. రైల్వే వ్యాగన్లు, కోచ్‌లు, ఇంజన్లు తయారు చేయాలనేదే కేంద్ర ముఖ్య ఉద్దేశమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ.. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే జీఎంను కోరారు. కొల్లూరు, ఈదులు నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్‌కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలని కోరారు.

# ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

**ప్రజానావ, హైదరాబాద్:**

ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న ఏఎస్పీ మేకల తిరుపతన్న బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. తిరపతన్నకు బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో తిరుపతన్న పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఛార్జ్‌షీట్ ఫైల్ చేసి మూడు నెలలు అయిన తర్వాత కూడా హైకోర్టు బెయిల్ ఎందుకు నిరాకరించిందని ధర్మాసనం ప్రశ్నించింది. తరుపరి విచారణను వచ్చే నెల 27కు ధర్మాసనం వాయిదా వేసింది.

**హైకోర్టును తీర్పును సవాల్ చేస్తూ...**

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన తిరుపతన్నకు ఈనెల ప్రారంభంలో హైకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం నిరాకరించింది. తిరుపతన్న ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్న నేపథ్యంలో బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో బెయిల్ ఇస్తే.. దాన్ని వల్ల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. పోలీసుల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నివేదిక ప్రకారం దర్యాప్తు చేయాలని ఖాకీలను కోర్టు ఆదేశించింది. హైకోర్టును తీర్పును సవాల్ చేస్తూ తిరుపతన్న సుప్రీంను ఆశ్రయించారు.

## రాష్ట్రంలో పెట్టుబడులకు జర్మనీ ఆసక్తి

**ప్రజానావ, హైదరాబాద్:**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీలోని రైన్లాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రైన్లాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఆ మంత్రి డానియేలా ష్మిట్ ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయింది. ఈ సమావేశంలో చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కూష్లెర్, హైదరాబాద్ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసాయనాలు, ఫార్మా ఉత్పత్తి, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్‌లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వామ్యం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించారు. సులభతర వాణిజ్య విధానాలు, తక్షణ అనుమతుల జారీలో తెలంగాణా అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా డానియెల్ బృందానికి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక తయారీ, పరిశోధనలను ప్రోత్సహించే ప్రపంచ స్థాయి వ్యవస్థను నిర్మించడంపై రాష్ట్రం దృష్టి పెట్టిందని తెలిపారు. రెండు ప్రాంతాల మధ్య సారూప్యతలను గుర్తించడం ద్వారా, పరస్పర ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తే బాగుంటుందని శ్రీధర్ బాబు సూచించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా పెట్టుబడులకు తెలంగాణా ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలుస్తోందని, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు అత్యున్నత మౌలిక సదుపాయాలతో పరిశ్రమ దృష్టిని ఆకర్షిస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా రైన్లాండ్, తెలంగాణా రాష్ట్రాలు ఇకపై 'సిస్టర్ స్టేట్' సహకార సంబంధాలు కలిగి ఉండాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. హైదరాబాద్ లో జరిగే బయో ఏషియా 2025 సదస్సుకు హాజరు కావాలని డానియెల్ బృందాన్ని శ్రీధర్ బాబు కోరారు. రైన్లాండ్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధిని పరిశీలించాలని ష్మిట్ బృందం శ్రీధర్ బాబును ఆహ్వానించింది.

## మా భర్తలు పోలీసులా.. కూలీలా




(మొదటి పేజీ తరువాయి)

పనులు, చెత్త ఏరే పనులు, మట్టి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కానిస్టేబుళ్లతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని వాపోయారు. తరచూ పోస్టింగులు మారుస్తూ ఉండటంతో పిల్లల చదువులకు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని కానిస్టేబుళ్ల సతీమణులు ధర్నాకు దిగారు. డిచ్‌పల్లి, హాజీపూర్, సిరిసిల్లలో ఆందోళన చేసిన కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని 7వ బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు.. బెటాలియన్ ఎదుట జాతీయ రహదారిపై ధర్నా చేశారు. 8 గంటలకు మించి కానిస్టేబుళ్లు డ్యూటీ చేస్తుండటంతో.. ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బెటాలియన్ పోలీసులకు ఐదేళ్ల పాటు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

**కానిస్టేబుళ్ల కుటుంబాలకు కేటీఆర్ సంఘీభావం...**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిచ్ పల్లి 7వ బెటాలియన్ ముందు ధర్నా చేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబాలకు సంఘీభావం తెలిపి, వారి సమస్యలు విన్నారు. 12వ బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ధర్నా చేస్తే భర్తలను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న బెటాలియన్ కానిస్టేబుల్స్ సమస్యలను మానవతా కోణంలో ఆలోచించి పరిష్కరించాలని కోరారు. వారి సమస్యలపై ప్రభుత్వంతో పోరాడుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

# అవసరమైతే జైలుకెళ్తా

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మోసం చేస్తోందని విమర్శించారు. రైతు బంధు ఇవ్వకపోవడం, రుణమాఫీ సక్రమంగా చేయకపోవడంపై ఆదిలాబాద్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. అన్ని పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, మేడ్చల్ వద్దనే 45 నిమిషాలు సమయం పట్టిందన్నారు. డిచ్‌పల్లి వద్ద కొందరు మహిళలు రోడ్డుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్నారని, ఏం కష్టమొచ్చింది అని దిగి అడిగానని కేటీఆర్ చెప్పారు. వాళ్లు పోలీసోళ్ల కుటుంబ సభ్యులని, వన్ పోలీసింగ్ కావాలని డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ధర్నా చేస్తున్నారని తెలిపారు. అఖరికి కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల కుటుంబ సభ్యులు కూడా ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు.

**పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే...**

అసలు చీటింగ్ కేసులు ఎవరి మీద పెట్టాలని కేటీఆర్ ప్రశ్నించారు. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిన వారి మీద కేసులు పెట్టాలన్నారు. రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీ చేయనందుకు రైతులు కేసులు పెట్టాలని సూచించారు. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి.. ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనందుకు యువత కేసులు పెట్టాలని, ఇలా అన్ని వర్గాలు పోలీసు స్టేషన్ల ముందు లైన్లు కట్టి చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా మిగలడు అని కేటీఆర్ తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇలాంటి కిరాతక పనులు బీఆర్‌ఎస్ పాలనలో చేయలేదని, మంత్రినో, కంత్రినో ఫోన్ చేస్తే ఆగం కాకండి.. న్యాయం, ధర్మం ప్రకారం నడుచుకోండి అని పోలీసులకు కేటీఆర్ సూచించారు. పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే పేర్లు రాసిపెట్టి మిత్తితో సహా ఇస్తామన్నారు. ఆదిలాబాద్‌లో ఖానాపూర్ చెరువు వద్ద 2 వేల ఇండ్లు కూలగొట్టేందుకు అధికారులు వెళ్లారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ ఇండ్లకు పర్మిషన్లు, పట్టాలు ఇచ్చారని కేటీఆర్ అన్నారు. ఇల్లు కూలగొడితే ఎవడన్న ఊకుంటాడా..? రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకునేందుకు సిద్ధంగా లేమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# పెండింగ్ డీఏలకు గ్రీన్ సిగ్నల్?

**ప్రజానావ, ఖైరతాబాద్:**

పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు ఇవ్వాలని చాలా రోజులుగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దీపావళి సందర్భంగా తమకు డీఏలను రిలీజ్ చేయాలని ఇటీవల సమావేశంలో కోరారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఉద్యోగ సంఘాల నాయకులతో భేటీకి ఆహ్వానం పంపించారు. పెండింగ్ డీఏలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని ఉద్యోగులు నమ్మకంతో ఉన్నారు. టీజీవో ఉద్యోగుల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ప్రధానంగా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలపై ఆర్థిక మంత్రి భట్టి ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వానికి సహకరించాలని ఉద్యోగులను కోరారు. నేటి సాయంత్రంలోపు డీఏలపై స్పష్టత ఇస్తామని తెలిపారు. ఈ భేటీలో ప్రధానంగా పెండింగ్‌తో ఉన్న 5 డీఏలు, బిల్లులు, హెల్త్ కార్డులు, పీఆర్సీ, సీపీస్ రద్దు, 317 జీవోపై చర్చించాలి. ఆయా అంశాల్లో నెలకొన్న ఇబ్బందులను ఉద్యోగ సంఘాల నేతలు.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**సీపీఎస్ రద్దుపై వినతి పత్రం...**

ముఖ్యమంత్రితో భేటీ తర్వాత ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. 10 నెలల తర్వాత ముఖ్యమంత్రితో భేటీ అయ్యామని చెప్పారు. దాదాపు 3 గంటల పాటు చర్చలు జరిగాయన్నారు. దీపావళి తర్వాత డిపార్ట్ మెంట్స్ వారీగా కేబినెట్ సబ్ కమిటీ సమావేశమవుతుందని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, డీఏల విషయంలో ఇవాళ సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 317 జీవోపై కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో కేబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారని ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు. ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యల పరిశీలన కోసం కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. కే కేశవరావు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించారు. సీపీఎస్ రద్దుపై సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ వినతిపత్రం ఇచ్చారు.

# తుస్సుమంటాయా? పేల్తాయా?

**ప్రజానావ, హైదరాబాద్:**

దీపావళికి ముందే రాష్ట్రంలో పొలిటికల్ బాంబుల ట్రెండ్ మొదలైంది. మరో రెండు రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపే పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన కామెంట్లు రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారాయి. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు, కాళేశ్వరం, ధరణి వంటి అంశాలపై చర్యలు మొదలవచ్చని పొంగులేటి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పకడ్బందీగా అన్ని ఆధారాలతో ఫైల్స్ రెడీ చేశామని, ఒకటి రెండు రోజుల్లో ఏదో ఒక అంశంలో బాంబులు పేలుతాయని, అందులో బీఆర్‌ఎస్ కు చెందిన ప్రధాన నాయకులు ఉంటారని పొంగులేటి కామెంట్ చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి కూడా గతంలో గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో కొనసాగిన వారి అక్రమాలు బయటపెట్టి చర్లపల్లిజైలుకు పంపుతామని, అక్కడ వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని, అక్రమార్కులు దేశం దాటి వెళ్లకుండా వారి పాస్ పోర్ట్ లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకు ముందు చెప్పినంత స్థాయిలో చర్యలు లేవనే అభిప్రాయం రాష్ట్ర ప్రజల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి మాటల్లో నిజం ఎంత? అనే చర్చ జరుగుతున్నది. ఒకవేళ చర్యలు ఉంటే.. ఏ స్కామ్ లో ఉంటాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

**ధరణి పోర్టల్ అక్రమాలపై...?**

ధరణిని ప్రైవేట్ విదేశీ కంపెనీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పగించిందని, దాని వెనుక ఎవరున్నారు, లావాదేవీలు ఏం జరిగాయి అనే దానిపై కూపీ లాగుతున్నామని సియోల్ పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి అన్నారు. తప్పు చేసిన వాళ్ళు ఎంత పెద్ద వాళ్లయినా వదిలిపెట్టే ప్రసక్తేలేదని వార్నింగ్ ఇచ్చారు. అయితే ఆయన మాటలను బట్టి చూస్తే.. మొదట చర్యలు ధరణి అక్రమాలపైనే ఉండబోతున్నట్లు తెలుస్తున్నది. కాగా గత బీఆర్‌ఎస్ పాలనలో ధరణిని అడ్డం పెట్టుకొని లీడర్లు లక్షల కోట్ల రూపాయల విలువైన సర్కారు భూములను అప్పనంగా తమ పేర్ల మీదికి, తమ అనుచరుల పేర్ల మీదికి, తమ బినామీలైన ప్రైవేటు వ్యక్తుల పేర్ల మీదికి బదలాయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. కోర్టు కేసులు నడుస్తున్న భూములను, భూదాన్ భూములను కూడా వదలకుండా కొట్టేశారని, ఒక్క గచ్చిబౌలి ఏరియాలోనే రూ. 57 వేల కోట్ల విలువైన భూములను బీఆర్‌ఎస్ లీడర్లు పొతం పెట్టారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఇప్పటికే కొన్ని ఆధారాలు సేకరించినట్లు సమాచారం. వాటిని ఆధారంగా చేసుకునే.. అక్రమార్కులను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తున్నది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# భారత మహిళల ఘన విజయం

## కివీస్‌తో తొలి వన్డే

అహ్మదాబాద్: న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి వన్డేలో భారత మహిళా క్రికెట్ జట్టు 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిడియా 44.3 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. తర్వాత లక్షఛేదనకు దిగిన న్యూజిలాండ్ 40.4 ఓవర్లలో 168 పరుగులకే కుప్పకూలింది. ఊరిస్తున్న లక్షంతో బ్యాటింగ్‌కు దిగిన కివీస్ మహిళా టీమ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో భారత బౌలర్లు సఫలమయ్యారు. సమష్టిగా రాణిస్తూ ప్రత్యర్థి టీమ్‌ను కుప్పకూల్చారు. రాధా యాదవ్ 3 వికెట్లను పడగొట్టింది. సైమా ఠాకూర్‌కు రెండు వికెట్లు దక్కాయి. కివీస్ బ్యాటర్లలో బ్రూక్ హాలిడే (39), మాడి గ్రీన్ (31), జార్జియా (25), లౌరెన్ (26), అమెలియా కెర్ 25(నాటౌట్) మాత్రమే రాణించారు. మిగతా వారు విఫలం కావడంతో కివీస్‌కు ఓటమి తప్పలేదు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను దీప్తి శర్మ (41), తేజల్ (42) ఆదుకున్నారు. ఓపెనర్ షఫాలీ వర్మ (33), యస్తికా భాటియా (37), జెమీమా రోడ్రిగ్స్ (35) పరుగులు మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లలో అమెలియా నాలుగు, జెస్ కెర్ మూడు వికెట్లు పడగొట్టారు.

**తొలి టెస్టులో సౌతాఫ్రికా గెలుపు**

ఢాకా: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో సౌతాఫ్రికా ఏడు వికెట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. 106 పరుగుల లక్ష్యాన్ని సఫారీ టీమ్ మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ టోనీ జోర్జి (41), ట్రిస్టన్ స్టబ్స్ 30 (నాటౌట్) బ్యాట్‌తో రాణించారు. కెప్టెన్ మార్‌క్రమ్ (20) తనవంతు సహకారం అందించాడు. అంతకుముందు బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన మెహదీ హసన్ మిరాజ్ (97) పరుగులు చేశాడు. జాకెర్ అలీ (58), రహీం (33), హసన్ జాయ్ (40) తమవంతు పాత్ర పోషించారు.

# స్పిన్నర్లు కూల్చేశారు..

**చెలరేగిన సుందర్, అశ్విన్**
**కివీస్ 259 ఆలౌట్, భారత్ 16/1**
**తొలి రోజు బౌలర్ల హవా**



పుణె: భారత్‌తో పుణె వేదికగా గురువారం ప్రారంభమైన రెండో టెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకే కుప్పకూలింది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (6), శుభ్‌మన్ గిల్ (10) క్రీజులో ఉన్నారు. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరును చేరుకోవాలంటే భారత్ మరో 243 పరుగులు చేయాలి.

**ఆదుకున్న కాన్వే, రచిన్**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌కు ఓపెనర్లు టామ్ లాథమ్, డెవోన్ కాన్వే శుభారంభం అందించారు. ఇద్దరు కుదురుగా ఆడుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. కానీ 2 ఫోర్లతో 15 పరుగులు చేసిన లాథమ్‌ను రవిచంద్రన్ అశ్విన్ వెనక్కి పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన విల్ యంగ్‌తో కలిసి కాన్వే పోరాటం కొనసాగించాడు. ఇద్దరు జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్‌ను పటిష్టపరిచేందుకు ప్రయత్నించారు. అయితే కుదురుగా ఆడుతున్న యంగ్‌ను అశ్విన్ వెనక్కిం పంపాడు. యంగ్ 18 పరుగులు చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా కాన్వే జోరును కొనసాగించాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాడు. అతనికి రచిన్ రవీంద్ర అండగా నిలిచాడు. ఇటు కాన్వే, అటు రచిన్ నిలకడగా ఆడుతూ కివీస్‌ను కష్టాల్లో నుంచి గట్టెక్కించారు. కానీ 141 బంతుల్లో 11 ఫోర్లతో 76 పరుగులు చేసిన కాన్వేను అశ్విన్ ఔట్ చేశాడు. అశ్విన్ మూడు వికెట్లు తీసి కివీస్ బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. కాగా, రచిన్ సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ స్కోరును ముందుకు నడిపించాడు.

**సుందర్ జోరు..**

ఈ దశలో వాషింగ్టన్ సుందర్ అసాధారణ బౌలింగ్‌తో చెలరేగి పోయాడు. కుదురుగా బ్యాటింగ్ చేస్తున్న రచిన్ రవీంద్రను అద్భుత బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. రచిన్ 105 బంతుల్లో ఐదు ఫోర్లు, సిక్స్‌తో 65 పరుగులు సాధించాడు. ఆ తర్వాత కివీస్ మళ్లీ కోలుకోలేక పోయింది. సుందర్ వరుస క్రమంలో వికెట్లను తీస్తూ కివీస్ ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశాడు. చివరి ఏడు వికెట్లను సుందరే పడగొట్టడం విశేషం. డారిల్ మిఛెల్ (18), టామ్ బ్లుండెల్ (3), గ్లెన్ ఫిలిప్స్ (9), సౌథి (5), ఎజాజ్ పటేల్ (4), సాంట్నర్ (33)లను సుందర్ ఔట్ చేశాడు. అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన సుందర్ 59 పరుగులు మాత్రమే ఇచ్చి ఏడు వికెట్లను పడగొట్టాడు. అశ్విన్‌కు మూడు వికెట్లు దక్కాయి. కివీస్ ఇన్నింగ్స్‌లోని పది వికెట్లను వీరిద్దరే పడగొట్టడం విశేషం. కాగా, న్యూజిలాండ్ చివరి ఆరు వికెట్లను 62 పరుగుల తేడాతో కోల్పోవడం గమనార్హం. ఇదిలావుంటే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 10 ఆధిక్యంలో కొనసాగుతోంది.



# రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేములవాడ ఆర్డీఓ సమావేశం

**ప్రజానావ, వేములవాడ:**

ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఫారం 18 ద్వారా, ఉపాధ్యాయులు ఫారం 19 ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. 6 నవంబర్ 2024 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మహేశ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

# వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**ప్రజానావ, వర్ధన్నపేట:**

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల వసతులు కల్పించామని,కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కె ఆర్ నాగరాజు గారు అన్నారు. గురువారం రోజున వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ లో ఐకెపి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతుల పండించిన సన్న ధాన్యానికి ప్రోత్సాహంగా క్వింటాలకు రూ 500 ల బోనస్ ను ప్రకటించడం జరిగిందన్నారు. కనీస మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలను పాటించాలి అన్నారు.ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయిచర్ ఉండాలి అని అన్నారు.కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు. రైస్ మిల్లులో విక్రయాలకు బోనస్ వర్తించదని ప్రతి ఒక్క రైతుకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టేక్యాబ్ ఛైర్మన్ మర్నేని రవీందర్ రావు, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరకుడు వెంకటయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ తో పాటు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు వివధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు మరియు ఐకెపి సంఘాల వారు తదితరులు పాల్గొన్నారు.



# కాటమయ్య కవచాలతో గీతన్నలకు రక్షణ

**మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**ప్రజానావ, తిమ్మాపూర్:**



గీత కార్మికుల సంక్షేమం, పరి రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 250 మంది కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కల్లు గీత ప్రమాదకమైన వృత్తి అని, తాటి చెట్లు ఎక్కి దిగేటప్పుడు ప్రమాదవశాత్తు జారిపడిన సంఘటనలు అనేకం ఉన్నాయ న్నాయన్నారు. ఇలాంటి ప్రమాదా ల్లో కొందరు గాయపడగా, మరి కొందరు మృత్యువాత పడ్డార న్నారు. తాటి చెట్లపై నుంచి జారిపడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి కాటమయ్య రక్షణ కవచాలను తయారు చేయించిందన్నారు. ఇక నుంచి ఏ ఒక్క గీత కార్మికుడు చెట్టుపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కాటమయ్య రక్షణ కవచం పేరిట 6 పరికరాలున్న కిట్‌ను అందిస్తున్నామన్నారు. ప్రతి గీత కార్మికునికి రక్షణ కిట్లను అందజేయడం జరుగుతుంద న్నారు. మానకొండూర్ నియోజక వర్గంలో 1600 మంది గీత కార్మికులుండగా, తొలి దశలో 250 మందికి రక్షణ కవచాలు అందించామని, రెండో విడతలో మిగితా వారికి అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. తాటి చెట్ల ప్రమాదాల నివారణ కోసం గీత కార్మికులు తప్పనిసరిగా రక్షణ కవచాలను ధరించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. తొలి విడతలో రక్షణ కవచాలు పొందలేని వారు నిరుత్సాహానికి గురి కావద్దని, అందరికీ ఈ కిట్లు అందజేస్తామని ఆయన చెప్పారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అభివృద్ధి అధికారి అనిల్ ఎం.ప్రకాశ్ మాట్లాడుతూ వచ్చే నవంబర్ మాసాంతంలోగా కల్లు గీత కార్మికులందరికీ రక్షణ కవచాలు పంపిణీ చేస్తామన్నారు. రక్షణ కవచాల పంపిణీలోమానకొండూర్ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధగోని లక్ష్మినారాయణగౌడ్, ఒగ్గె దామోదర్, , బత్తిని శ్రీనివాస్ గౌడ్, పడాల శంకరయ్య, గోపు మల్లారెడ్డి, గోపగోని బస్వాగౌడ్, నోముల అనిల్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి పి.శ్రీనివాస్ రావు, సర్కిల్ ఇన్ స్పెక్టర్ సాయిబాబా, బీసీ సంక్షేమశాఖ ఏపీసీడబ్ల్యూ టి.సంపూర్ణ, హెచ్.డబ్ల్యూవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మురుగు కాదు.. నగరపాలిక తాగునీరు

**ప్రజానావ, గోదావరిఖని:**

చిత్రంలో కనిపిస్తోంది మురుగు నీరు అనుకుంటే పొరపాటే. రామగుండం నగరపాలిక కుళాయిల్లో సరఫరా చేసే సురక్షిత జలం. 50వ డివిజన్‌లోని స్వతంత్రచౌక్‌లో గృహాలకు కుళాయిల్లో వచ్చే తాగునీరు ఇది. పైపులైనులో లీకేజీ కారణంగా మురుగు కలుస్తుండటమే ఇందుకు కారణం. కుళాయిలో నీరు వస్తుందంటే దుర్గంధం భరించలేక ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వాపోతున్నారు. గతంలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా స్థానికుల విన్నపాలతో లీకేజీ నివారణ చర్యలు చేపట్టారు. పక్షం రోజులుగా మళ్లీ ఇదే పరిస్థితి. ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ నగరంలోని సుమారు వెయ్యికిపైగా కుళాయిల్లో నీరు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగడానికి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుండగా ఇతర అవసరాలకు దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' నగరపాలక నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో పరిశీలిస్తామని పేర్కొన్నారు.

# రాజన్న హుండీ లెక్కింపు

**రూ.1.46కోట్ల ఆదాయం**

**సమకూరిన 211 గ్రాముల బంగారం, 009 కిలోల వెండి**

**ప్రజానావ, వేములవాడ:**

వేములవాడ రాజన్నకు భారీగా ఆదాయం సమకూరింది. నెల రోజుల హుండీ ఆదాయాన్ని కార్యనిర్వహణాధికారి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం లెక్కించగా రూ.1,46,16,253తో పాటు 211 గ్రాముల బంగారం, 009 కిలోల 900 గ్రాములు వెండి సమకూరింది. ఈ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏ ఈఓలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్, హోం గార్డు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చూడగా, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి హుండీ లెక్కింపులో భాగమైంది.





## ఆర్టీసీపై ప్రయాణికుల అసహనం..

**ప్రజానావ,వేములవాడ:**

సిరికొండ, కొనరావుపేట గ్రామాల మీదుగా వస్తున్న వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ వరకు రాక పోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ వరకు దింపాల్సిన ఆర్టీసీ బస్సు పట్టణంలోని చిన్ననంది జంక్షన్ వద్ద ప్రయాణికులను దింపుతోంది. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు బారికెడ్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు సహకరించాలని డిపో మేనేజర్ శ్రీనివాస్ కోరారు.

## కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

### సీపీఐ నేతల డిమాండ్

**ప్రజానావ, కరీంనగర్:**




నగర పాలక సంస్థ పరిధిలోని రేకుర్తి శివారులో గల 55సర్వేనెంబర్ లో అన్యాక్రాంతంగా కబ్జాలకు గురైందని దీనిపై వెంటనే జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని 55 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూమిని అదేవిధంగా స్మశాన వాటికకు సంబంధించిన భూమిని కబ్జా చేశాడని ఆరోపణలు వస్తున్నాయని ఇది దుర్మార్గమని కబ్జాదారులు ఎంతటి వారైనా శిక్షించాలని వారు కోరారు.మేయర్ ఈ సర్వే నంబర్ లోని భూమిని కబ్జాకు పాల్పడనట్లయితే పత్రికా ముఖంగా వచ్చి ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. ఈ సర్వే నంబర్లు స్మశాన వాటిక స్నానాపు గదులు,బోరు ఇతర పనుల కోసం గత గ్రామపంచాయతీ 15 లక్షల రూపాయలను కూడా మంజూరు చేసిందని దీనిని కూడా లెక్క చేయకుండా కబ్జాలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ప్రభుత్వ భూములను ప్రజా ప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గత ప్రభుత్వ హాయంలో దిగమింగారని చెరువులను, కుంటలను, పరం పోగు, ఎస్ ఆర్ ఎస్ పి భూములను సైతం వదలకుండా అక్రమనలకు గురి చేశారని కరీంనగర్ ను ఆనుకుని ఉన్న బొమ్మకల్, సీతారాంపూర్, ఆరేపల్లి,తీగల గుంటపల్లి,నగునూరు,చింతకుంట, కమాన్ పూర్, కొత్తపెల్లి, పద్మనగర్ గ్రామాలను పూర్తిగా కబ్జాలమయం చేసి దిగమింగారని ఆరోపించారు. కరీంనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా అక్రమనకు గురైన భూములను వెంటనే రెవెన్యూ అధికారులు పర్యవేక్షించి ప్రభుత్వ భూమిని కబ్జాదారులనుండి లాక్కొని పేద ప్రజలకు పంచాలని కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. లేనిపక్షంలో ప్రజలను ఐక్యం చేసి ప్రభుత్వ భూములను సిపిఐ ఆధ్వర్యంలో అక్రమించి ఇండ్లు లేని పేద ప్రజలకు పంచుతామని కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజులు హెచ్చరించారు.



## ఘనంగా ముగిసిన వీపీల్ టోర్నమెంట్

**ప్రజానావ, తొర్రూర్**

వెలికట్ట గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసాయి. ఫైనల్ మ్యాచ్ లో వరంగల్ టీం దరదపల్లి టీం మీద గెలిచి మొదటి ప్రైజ్ 30,000 గెలుచుకుంది. ద్వితీయ 20,000 ధరడేపల్లి టీం, తృతీయ డీసీ తండా టీం 10,000 గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం లో దాతలు బత్తుల యాకయ్య, మాలోతు సునీత రాజేందర్, అభ్యాస్ స్కూల్ నరేష్ రెడ్డి, చిదిరాల నవీన్, ఏషబోయిన వెంకన్న, దొడ్డా వినయ్, ఆబోతు మహేష్, మోదుగుల మోహన్ రావు, మన్నెం సైదులు, బందు రాహుల్,బొమ్మెర నగేష్, కొమ్ము అజయ్,పొన్నం కొమురయ్య, నిర్వాహకులు పోసాని సంతోష్, కొమ్ము ప్రభాకర్, వీరమనేని రాజు,శ్రీపాద వంశీ, పోసాని అనిల్, కొమ్ము ప్రవీణ్, భోగ కిరణ్, తరుణ్, మురళి, గిరీష్, యోగేష్, లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలి

### బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కంది శ్రీనివాస్

**ప్రజానావ,చిగురుమామిడి:**

పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ ను వెంటనే విద్యార్థులకు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కంది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. పెండింగ్లో ఉన్న రూ.3వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.తక్షణమే విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది ఒకటని శ్రీనివాస్ విమర్శించారు.ఈ సమావేశంలో తాళ్లపల్లి రవీందర్ గౌడ్,చంద్రయ్య, రాజయ్య తదితరులు ఉన్నారు.

## నవంబర్ 1న కరీంనగర్ కు బీసీ కమిషన్ బృందం రాక

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝ వెల్లడి

**ప్రజానావ, సిరిసిల్ల:**



తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్ కు విచ్చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల మరియు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 1న కరీంనగర్ కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. అభిప్రాయాలు , సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా ఎవరైనను సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు.





## బాలవికాస ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజానావ,బెజ్జంకి :**

బెజ్జంకి మండలం లో బెజ్జంకి క్రాసింగ్ లోని ఫంక్షన్ హాల్ లో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 మంది అనాధ వృద్ధులు మరియు అనాధ పిల్లలకు బ్యాగ్స్,బుక్స్ బెడ్షీట్స్,బియ్యం,రగ్గులు, పప్పు దినుసులు వివిధ రకాల వస్తువులను జన వికాస్ (బాలవికాస్ )సంస్థ సీనియర్ సహాయకులు సుజాత సహాయకులు అనమేరి వట్టి సుజాత గాజే సుజాత బండేలా సుజాత లచే నిర్వహించిన వివిధ రకాల వస్తువుల పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,ఏఎంసి చైర్మన్ పులి క్రిష్ణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్ బండిపెల్లి రాజు,బైరి సంతోష్,ఎర్రల రాజు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రసమయి పరామర్శ

**ప్రజానావ, ఇల్లంతకుంట**



మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి కొమురయ్య, చిలువేరు సంజీవరెడ్డి, నాయిని వంశీ, కర్ల ఎల్లవ్వ లు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా మృతుల కుటుంబాలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు.

**బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ**

వల్లంపట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పండుగ భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ రవిందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయవెంకటనర్సింహా రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జంగిటి రమేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



రాజన్న ఆలయ ప్రాంగణంలో ఓ చిన్నారి వానరం ప్రమాదానికి గురైంది. కనీసం నడవలేని స్థితిలో లేకపోవడం గమనించిన ఈఓ కే.వినోద్ రెడ్డి వెంటనే గోశాలలో విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ వైద్యులను పిలిపించి చికిత్స చేయించి, మూగ జీవాలపై తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

- ప్రజానావ, వేములవాడ

# అమరుల త్యాగాలు స్ఫూర్తివంతం

### సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్





**ప్రజానావ, సిరిసిల్ల:**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో (ఫ్లాగ్ డే) భాగంగా గురువారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ చట్టాలు, కేసుల ఛేదన, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగాలు, డాగ్, బాంబ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్ మెంట్, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు, మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ఏర్పాటయిన షీ టీం, భరోసా సెంటర్, సైబర్ నేరాలు, పోలీస్ శాఖలో ఉపయోగిస్తున్న ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, పోలీస్ స్టేషన్ పనితీరు, డయల్ 100 గురించి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వారి త్యాగాలను స్మరిస్తూ ఈ రోజు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్స్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై, పోలీస్ శాఖ పనితీరు,వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగహన పెంచుకోవాలని, తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి , అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏవిధంగా ఉపయోగపడుతుంది, పోలీస్ స్టేషన్ పని తీరు పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ కృష్ణ, ఆర్ఐలు యాదగిరి, రమేశ్, మధుకర్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, సిబ్బంది విద్యార్థులున్నారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన శ్రీ చైతన్య విద్యార్థులు



**ప్రజానావ, తిమ్మాపూర్:**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్,స్పోర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చెర్మైన్ ముద్దసాని రమేష్ రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, జూనియర్ కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, తదిత రులు అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆటలలో గెలుపోటము లు సహజం అని, గెలిచిన వారు మరింతగా ఆటలలో మెలకువలు నేర్చుకొని రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి.డి లెంకల మహిపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి శ్రీనివాస్, కోచ్ శివ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మద్దిరాల వీరస్వామి నియామకం

**ప్రజానావ, దంతాలపల్లి:**

మానవ హక్కుల సంఘం హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర ప్రధాకార్యదర్శి గా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన మద్ధిరాల వీరస్వామిని నియమించినట్లు జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి తెలిపారు. మద్ధిరాల వీరాస్వామి గత ముప్పై సంవ్సరాలుగా ప్రజా ఉద్యమంలో పనిచేస్తూ మొదటగా ఎమ్మార్పీ ఎస్ లో మండల ప్రధానకార్యదర్శిగా ఉమ్మడి జిల్లా ప్రదాన కార్యదర్శిగా, తెలంగాణ మలిదశ ఉద్య మంలో మండల కమిటిలో పనిచేసి అందరికీ అం దుబాటులో ఉండి వివిధ సామాజిక ఉ్యమాలలో శక్తివంచన లేకుండా కృషి చేస్తూ మానవహక్కుల సంఘం లో చేరి మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి గా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రధాకార్యదర్శిగా నియామకం జరగడంతో పలువురు అభినందనలు తెలిపారు. ఈ సంద ర్భంగా అసంఘం నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల వీరాస్వామి మాట్లాడుతూ నేను గత ముప్పై సంవత్సాలుగా వివిధ సామాజిక, రాజకీయ ఉదమాలలో ఉత్సాహవంతంగా పనిచేస్తున్న సంద ర్భంగా జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున్ రెడ్డి నన్ను గుర్తించి నాకు ఈ అవకాశం కల్పించినం దుకు దన్యవాదాలు తెలియచేస్తూ ఎవరికి ఎలాంటి సమస్యవచ్చిన అందరికీ అందుబటులో ఉండి అందరిని కలుపుకొనిపోయి సమస్యల పరిష్కారాని కి కృషి చేస్తానని తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజానావ, వేములవాడ :**

అనుపురం శివారులోని వేములవాడకరీం నగర్ ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. దాదాపు 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిసరాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సీఐ తెలిపారు.





# కవ్వంపల్లి... రైతు రుణమాఫీ పై చర్చకు సిద్ధమా

**ప్రజానావ, ఇల్లంతకుంట:**

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణకు కమీషన్ల మీద ఉన్న ప్రేమ రైతులపై లేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. గురువారం ఇల్లంతకుంటలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ ఏ ఊర్లో పూర్తి అయిందో ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి హడావిడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేస్తూ ఉన్నారు తప్ప..ఎక్కడ కూడా ఒక్క లారీ మిల్లుకు పోలేదని, అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కాలం వెల్లదీస్తోందని రసమయి మండిప డ్డారు. అకాల వర్షాలతో రైతులు ఆగమయ్యారని, రైతులు గంటకు 3500 పెట్టి చైన్ హార్వెస్టర్లతో వరి కొస్తున్నారాని, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం తో ప్రయివేట్ వ్యాపారులు అడ్డికి పావుసేరు ధాన్యం కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే కమీషన్ల నారాయణ ఏడాదిలో ఏ ఊరికి పోలేదని, ఎమ్మెల్యే ప్రారంభం చేసిన ఒక్క కొనుగోలు కేంద్రాల్లో కూడా మిల్లులు అలాట్ మెంట్ కాలేదన్నారు.కొనుగోలు కేంద్రాల్లో కనీసం గొనె సంచులు ఇవ్వలేదని, బీఆర్ఎస్ పార్టీ తరపున తాము నిజాలు చెప్తూతుంటే అబద్దాలు చె ప్తున్నారని ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడటం హాస్యాస్పదమని రసమయి బాలకిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ప్రభుత్వంపై నమ్మకం లేక... దిక్కులేక దళారులకు అమ్ముకుంటున్నారని ,రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను కొంటామని రైతులకు కనీసం ప్రభుత్వం భరోసా ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల లో ఏ ఒక్క గ్యారెంటీ అమలు కాలేదు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దమ్ము ఉంటే మిల్లులు అలాట్ మెంట్ చేయించాలని, అయ్యా కమీషన్ల నారాయణ ఇప్పటి వరకు ఏ గ్రామములో రైతు రుణమాఫీ పూర్తి అయిందో చర్చకు సిద్ధమా.... నీ ఊరు అని చెప్పుకొనే పచ్చునూరులోనే చర్చకు సిద్ధమా.. ఎన్నికల ముందు ధాన్యానికి 500 భోనస్ ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ ఇప్పుడు సన్న వడ్లకే భోనస్ ఇస్తామని చెప్పడం ఏమాత్రం న్యాయమని రసమయి బాలకిషన్ ప్ర శ్నించారు. తెలంగాణ రైతులు దొడ్డు రకం వడ్లను సాగు చేస్తారు..సన్నాలు ఎకరాల కొద్దీ సాగు చేయ రుకొనుగోలు కేంద్రాల్లో గొనె సంచులు లేనప్పుడు.. ఎమ్మెల్యే వేసుకునే కండువాలో ధాన్యం జోకమం టారా అని రసమయి బాలకిషన్ అన్నారు.ఎమ్మెల్యే కవ్వంపల్లికి కాంగ్రెస్ లీడర్లతో జోకించుకునుడు తప్ప...ధాన్యం జోకించే దానిపై సోయిలేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారె డ్డి, సెస్ డైరెక్టర్ రవిందర్ రెడ్డి, కేవీఎన్ రెడ్డి, ఉడుతల వెంకన్న, గోపాల్ రెడ్డి, సంతోష్ రెడ్డి, నాగరాజు, కేషవేని శ్రీనివాస్, దమ్మని మధు, రఘు, బోయిని రమేష్, మధు, రాజు, దేవయ్య, సత్యం, రాజు, తదిత రులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

**రైతు ప్రయోజనాలే సర్కార్ ప్రాధాన్యతలు**
**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**ప్రజానావ, తిమ్మాపూర్ :**



రైతులకు అండగా ఉంటూ వారికి అన్ని విధాలుగా ప్రయోజనాలు చేకూర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రాధాన్యతలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.తిమ్మా పూర్ మండలంలోని గొల్లపల్లి, నేదునూరు, లక్ష్మీదేవి పల్లి, వచ్చునూరు, రాంహనుమాన్ నగర్, జూగుండ్ల గ్రామాలలో గురువారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రయోజ నాలే ముఖ్యమని భావిస్తూ ఇందుకోసం ఆర్థిక భారం ఎంతైనా సరే అని సర్కార్ ధాన్యం సేకరిస్తోందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు ధాన్యాన్ని వి క్రయించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేస్తున్నద న్నారు. వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే వేగవంతం వేగవంతం చేసిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వరి కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయని ఆయన చెప్పారు.ఐకేపీ, సింగిల్ విండోల ద్వారా వరి ధాన్యం కొనుగోళ్లు సా గుతున్నాయని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమాల్లో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోర పల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి అనిల్, డి.శ్రీనివాస్ రావు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పింగళి కృష్ణారెడ్డి, రెడ్డి గాని రాజు, గంగుల లక్ష్మారెడ్డి, ఉప్పు లేటి సతీష్, వడ్లకొండ తిరుపతి, బండిపల్లి తిరుపతి, బోయిని అంజయ్య, వేల్పుల యాదవ్, జంగ రామ కృష్ణారెడ్డి, మణికంఠ రెడి తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ ఫిల్టర్ బెడ్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజానావ, కరీంనగర్:**

ఫిల్టర్ బెడ్ లో యూనియన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్య క్షులుగా కరీంనగర్ నగర మాజీ మేయర్ తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ , అధ్యక్షుడు గా తాగూర్ సాయి కిరణ్ సింగ్, ఉపాధ్యక్షులుగా, పూసల వేణుగోపాల్ , ప్రధాన కార్యదర్శిగా కిన్నెర కొమురయ్య, కోశాధికారిగా కొల్లూరి సత్తయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా సర్దార్ రవీందర్ సింగ్ హాజరై నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంస్థలో యూనియన్ ఏర్పాటు చేసుకోవాలని కార్మికులంద రూ ఐక్యత ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో BRS నాయకులు మాజీ కార్పొరేటర్ సాధవేణి శ్రీనివాస్, కెమసారం తిరుపతి , కొత్తకొండ శ్రీనివాస్, దండబోయిన రాము , ఫిల్టర్ బెడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేములవాడ ఆర్డీఓ సమావేశం

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేములవాడ ఆర్డీఓ సమావేశం**

**ప్రజానావ, వేములవాడ:**

ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ రాజేశ్వర్ సమావేశం నిర్వహిం చారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షిం చారు. ఫారం 18 ద్వారా, ఉపాధ్యాయులు ఫారం 19 ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. 6 నవంబర్ 2024 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నా రు. ఈ సమావేశంలో తహసీల్దార్ మహేశ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

## వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**ప్రజానావ, వర్ధన్నపేట:**

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల వసతులు కల్పించామని,కొనుగో లు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కె ఆర్ నాగరాజు గారు అన్నారు. గురువారం రోజున వర్ధన్నపేట మండల పరిధి లోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ లో ఐకెపి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతుల పండించిన సన్న ధాన్యానికి ప్రోత్సాహంగా క్వింటాలకు రూ 500 ల బోనస్ ను ప్రకటించడం జరిగిందన్నారు. కనీస మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలను పాటించాలి అన్నారు.ఏ గ్రేడ్కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణ యించిన ప్రకారం 17% మాయుచర్ ఉండాలి అని అన్నారు.కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు. రైస్ మిల్లులో విక్రయాలకు బోనస్ వర్తించదని ప్రతి ఒక్క రైతుకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టేక్యాబ్ చైర్మన్ మర్నేనీ రవీందర్ రావు, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరకుడు వెంకటయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ తో పాటు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు వివధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు మరియు ఐకెపి సంఘాల వారు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులతో అప్రమత్తంగా ఉండాలి





**కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు**
**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**


**ప్రజానావ, మానకొండూర్:**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ము కునే విషయంలో దళారులచే మోస పోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుం దని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంప ల్లి సత్యనారాయణ చెప్పారు. మానకొండూర్ మం డలంలోని ముంజంపల్లి, మానకొండూర్ , కెల్లెడు, రంగపేట, వెల్ది, పోచంపల్లి, మద్దికుంట, పచ్చునూర్, ఊటూర్, వేగురుపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లడుతూ మా ట్లాడుతూ గ్రామాల్లో మిల్లర్లు, దళారులు కళ్లాల వద్దకే వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే డబ్బులు చె ల్లించకుండా రైతులను చేసేవారన్నారు. మిల్లర్లు, దళారుల మోసాలను కట్టడి చేయడానికే కాకుండా రైతులకు ధాన్యం అమ్మాకల్లో ఇబ్బందులను తొలగిం చేందుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని ఆయన వివరించారు. వరి ధాన్యం కొ నుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే వేగవంతం చేసిందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ కొనుగోలు కేంద్రాలను తెరుస్తున్నా మని ఆయన వివరించారు.ఐకేపీ, సింగిల్ విండోల ద్వారా వరి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

**సొంతూరులో కవ్వంపల్లికి ఘన స్వాగతం**

స్వగ్రామం పచ్చనూరుకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు గ్రామ స్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ముఖ్యంగా మహిళలు బతుకమ్మలతో స్వాగతించారు. ఈ కార్య క్రమాల్లో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్ తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.తిరుపతిరెడ్డి, పంజాల శ్రీనివాస్, వాల అంజుత్ రావు, సుధగోని తిరుపతి,క నకం అశోక్, మహేందర్, ప్రభాకర్, మానకొండూర్ సింగిల్ విండో డైరెక్టర్ పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# ప్రమాదంలో మానవ మనుగడ




పుల్లెంల గణేష్
(ధర్మ సమాజ్ పార్టీ, స్టడీ & రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్) 9553041549

జీవ పరిణమ పరివర్తన సిద్ధాంతం ఆధారంగా కొన్ని వేల లక్షల సంవత్సరాల క్రితం ప్రకృతిలో ఉన్న పంచభూతాల మధ్య జరిగిన సంఘర్షణలో భాగంగా.. భూ గ్రహంపై ఎన్నో వేల లక్షల జాతుల జీవాలు పురుడు పోసుకున్నాయి. అయితే నేడు మానవుడు సాధించిన నాగరికత ప్రగతిలో భాగంగా ఒక భూ గ్రహం మాత్రమే వివిధ జీవరాశులకి మనుగడ సాగించడానికి అనుకూలపైన ప్రాంతం కాగా, భూగ్రహం పై ఉన్న వేలాది లక్షలాది జీవాల్లో బుద్ధిగల జీవి మానవ జాతి మాత్రమేనని జగమెరిగిన సత్యం. అయితే ఆనాటి ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు అన్ని జీవరాశుల మనుగడ లో భాగంగా మానవుడు కూడా మనుగడ సాగించడానికి పోరాటం చేస్తూనే ఉన్నాడు. నాటి ప్రాచీన కాలంలో మానవుడు మేధస్సు మెరుగుపడక ఒకరిని ఒకరిని చంపుకొని క్రూరమైన జీవరాశులతో పాటు తేడా లేకుండా జీవిస్తే, నేడు ఇంత ఆధునిక సమాజంలో ఉండి కూడా క్రూరమైన జంతువుల వలె మానవుడు ప్రవర్తిస్తూ జీవిస్తున్నాడని లోతుగా ఆలోచిస్తే నిరూపణ కాపాడుతుంది. అన్ని జీవరాశుల వలె మానవుడు తోటి మానవుడిని చంపుకోకుండా తన ఉనికిని కాపాడుకోవడం కోసం తోటి మానవుడితో రక్త సంబంధాలు, బంధుత్వాలు పెట్టుకొని నేటి వరకు మానవుడు మనుగడలో ఉండగలుగుతున్నాడు.ఇక రోజురోజుకీ మానవుడు సాధించిన ప్రగతి నాగరికతలో భాగంగా మెరుగైన జీవన విధానాన్ని సాగించడం కోసం మానవ సాంస్కృతిక విప్లవంలో భాగంగా మానవుడు వర్ణం,మతం,కులం, ప్రాంతీయ,భాషా పర తారతమ్యాలని పెంచి పోషించుకుంటున్నాడు. వీటిలో భాగంగానే మానవుడు మరింత గొప్పగా జీవించడానికి భయభ్రాంతులతో కూడిన మెరుగైన జీవన విధానం ఉండటం కోసం దైవత్వాన్ని సృష్టించుకుని తనకు తానుగా స్వీయ క్రమశిక్షణ విధానాన్ని పాటించుకొని మానవుడు చేసే తప్పు _ఒప్పుల్లో భాగంగా దైవత్వాన్ని సృష్టించుకున్నాడు. ప్రాచీన కాలంలో మానవ మనుగడని కాపాడడం కోసమే దైవత్వాన్ని సృష్టించుకున్న మానవుడు నేడు అదే దైవత్వం పేరుతో సాటి మానవుడి పైనే స్వేచ్ఛ సమానత్వ సోదరభావ నైతిక మానవ విలువ లేకుండా తోటి మానవుడిని బుద్ధిలేని జీవి వలె క్రూరంగా చంపుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడు. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు మానవుడు తోటి మానవుడితో సంబంధాలు పెట్టుకొని వర్ణం జాతి మతం కులం భాష వివిధ భేదాలతో వివిధ దేశాలుగా ఏర్పాటు చేసుకొని తమ తమ దేశాలను కాపాడుకోవడం కోసం ఎంతో అత్యాధునికమైన రక్షణ ఆయుధాలని మానవుడు తయారు చేసుకున్నాడు. ప్రాచీన కాలంలో దేవుడే మానవుడిని కాపాడుతాడని దైవత్వాన్ని సృష్టించుకుని నేడు అదే మానవ మనుగడని ఉనికిలో ఉంచడం కోసం కాకుండా వివిధ మతాల దైవత్వాన్ని ఉనికిలో ఉంచడం కోసం సాటి మానవుడి పైనే శత్రుత్వాన్ని పెంచుకొని ప్రతి దినము సాటి మానవుడిని చూసి భయంతో బిక్కు బిక్కున జీవిస్తున్నాడు. ప్రకృతి ధర్మంలో భాగంగా ఒక జీవి బ్రతకాలంటే మరొక జీవి పై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడక తప్పదు, అందులో భాగంగానే అవసరానికి మించి ఒక జీవిని చంపి మరొక జీవి జీవించాల్సిన పరిస్థితి సహజంగా ఉండినప్పటికీ, నేడు ఆ సహజ సూత్రాలను మానవుడు తన స్వార్ధ ప్రయోజనల కోసం తోటి మానవుడిని చంపే అనాగరికంలోకి నెట్టివేయబడ్డాడు. ఇది ఆనాటి నుండి నేటి వరకు మానవుడు సాధించిన అత్యంత గొప్పనైన అభివృద్ధి అని చెప్పుకోవడానికి మానవ సమాజానికె సిగ్గుచేటు ఎందుకంటే బుద్ధిలేని జీవరాసులే బలమైన జీవిని చూసి బలహీనమైన జీవులు ఎంతో జాగ్రత పడుతూ సజాతి జంతువులన్నీ ఐక్యంగా జీవిస్తున్నాయి. కానీ నేడు మానవుడు ఏర్పాటు చేసుకున్న కుల మత వర్ణం ప్రాంతం భాష వివిధ తారతమ్యాల్లో భాగంగా సాటి మనిషిని చంపే పరిస్థితిలోకి మానవుడి ఉనికి నెట్టి వేయబడింది.అంటే ఆధునిక సమాజంలో జీవిస్తూ కూడా తెలియకుండానే ప్రాకృతిక వ్యవస్థని అమలు పరుస్తున్నాం. ప్రాకృతిక వ్యవస్థ అంటే ఎంతోమంది రాజనీతిజ్ఞుల అభిప్రాయం ప్రకారం రాజ్యం రాజకీయ జీవితం ఏర్పడక ముందు మానవుడు కొనసాగించిన జీవన విధానమే "ప్రాకృతిక వ్యవస్థ" ఈ ప్రాకృతిక వ్యవస్థలో మనిషి మనిషికి మధ్య స్వేచ్ఛ సమానత్వ సోదరభావ వివిధ మానవత విలువలు లేవు. నేడు మానవుడు సాధించిన ప్రగతిలో భాగంగా మా దేశమే గొప్పగా అభివృద్ధి చెందాలని, మా దేశీయులు మాత్రమే అత్యంత ఉన్నత స్థానంలో ఉండాలని, మా మత దేవుడు మాత్రమే ప్రథమ స్థానంలో ఉండాలని నెపంతో వివిధ దేశాల మధ్య ప్రత్యక్షంగా పరోక్షంగా నేడు యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి.ప్రపంచంలో లోని వివిధ దేశాల మధ్య పరోక్షంగా 'కోల్డ్ వార్" జరుగుతూనే ఉన్నది. మానవ నాగరికతలో భాగంగా మా దేశం, మా మతం, మా ప్రాంతం మాత్రమే గొప్పగా విరిజిల్లలని

> ప్రాచీన కాలంలో మానవుడు వివిధ క్రూరమైన జంతువుల నుండి తనను తాను కాపాడుకోవడం కోసం రక్షణ కోసం వివిధ మూలకాలతో ఆయుధాలని తయారు చేసుకుంటే నేడు అదే మానవుడు తోటి మానవుడి నుండి రక్షణ పొందడం కోసం ఎంతో ప్రమాదకరమైన మరణాయుధాలను తయారు చేసుకొనిన నేటి ఆధునిక మానవులుగా గొప్ప నాగరికతనీ ప్రగతిని సాధించామని చెప్పకోవాలో సాటి మనిషిని చూసి ఎలాంటి వివక్షతలు చూపకుండా సాటి మనిషిగా చూడలేకపోతున్నందుకు సిగ్గుపడే పరిస్థితులకు మానవ సమాజం నెట్టి వేయబడినందుకు బుద్ధి జీవులుగా నేడు మనం ఆలోచించాల్సిన సందర్భం నెలకొన్నది.

రక్షణ ఆయుధాలని తాయారు చేసుకొని మానవ జాతి భవిష్యత్ లో అన్ని జీవరాశులతో పాటు సమానంగా ఉనికి ఉంటదా..? అనే పరిస్థితి ఎంతో లోతుగా ఆలోచిస్తే కానీ అర్థం కాని పరిస్థితి..! ఎందుకంటే సాటి మనిషిని చూసి స్వేచ్ఛ సమానత్వ సోదరభావ మానవ నైతిక విలువలతో గొప్పగా జీవించకుండా కారణాలు ఏవైనప్పటికీ మానవుడు సృష్టించుకున్న కులం మతం ప్రాంతం వర్ణం భాష దైవత్వం వివిధ తారతమ్యాలు మూలంగా ఒక విధంగా మానవ మనుగడనే ప్రమాదంలోకి నెట్టివేయబడిందని స్పష్టంగా నిరూపణ కాపాడుతున్నది. ఒకనాడు ప్రాచీన కాలంలో వివిధ క్రూర జంతు సమూహాల నుండి మానవ ఉనికిని కాపాడుకోవడం కోసం వివిధ మూలకాలతో రక్షణ ఆయుధాలను తయారు చేసుకున్న మానవుడే నేడు అదే మానవ సమాజం మనిషి మనిషికి మధ్య స్వేచ్ఛ సమానత్వ సోదరభావ మానవ విలువలు పాటిస్తూ జీవించకుండా..?మానవ మనుగడకె ముప్పు తెస్తున్న మారణహోమం చేస్తున్న దుర్భేద్యమైన ఆయుధాలు లేని మానవ సమాజాన్ని చూడగలమా అనే ప్రశ్న వేసుకుంటే సాధ్యమయ్యే పనేనా అని మరో ప్రశ్న రాక మానదు...? మొదటి ప్రపంచ యుద్ధ తదనంతరం ఏర్పడిన నానజాతి విఫలం అవ్వడం మూలంగానే రెండవ ప్రపంచ యుద్ధం జరిగి ఐక్యరాజ్య సమితి ఏర్పాటు అయ్యింది.దాదాపుగా ఏడాది పైగా రష్యా ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం మరియు నేడు తాజాగా ముస్లిం క్రిస్టియన్ దేశాల మధ్య జరుగుతున్న బాంబుల యుద్ధం మూలంగా ఐక్యరాజ్య సమితి విఫలం అయ్యి మూడవ ప్రపంచ యుద్ధమే జరిగితే నేడు ప్రపంచ దేశాలకు ఉన్న అత్య ఆధునిక సంకేయ పరిజ్ఞానం మూలంగా అణు అనుబాంబుల తో యుద్ధాలు జరిగితే ఈ భూమి పై ఒక్క మానవ మనుగడకే కాదు సమస్త జీవరాశులకే మానవుడు ముప్పు తెచ్చినవాడు అవుతాడు.అంటే ఒక విధంగా మానవుడు ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు సాధించిన ప్రగతిలో భాగంగా నేడు మరణహోమం చేసే రక్షణ ఆయుధలకే ప్రాముఖ్యతనిస్తున్నాడు కానీ సాటి మనిషితో మారణహోమం చేసే అనుబాంబులు,వివిధ ఆయుధాలు లేకుండా మానవతా విలువలతో గొప్పగా జీవించగలుగుతామనే పరిస్థితులు లేవని స్పష్టమవుతున్నది. కానీ ఒక మానవ సమాజం తప్ప మిగతా జీవరాశులన్నీ కూడా వాటికి ఎలాంటి రక్షణ ఆయుధాలు లేకుండా అయ జీవరాసులు బతకడం కోసమే మరో జీవి పై ఆధారపడుతూ సజాతి గల జీవరాశులన్నీ కూడా బుద్ధిలేని జీవరాశులు అయినప్పటికి ఐకమత్యంగా జీవించగలుగుతున్నాయి కానీ ఈ అనంత విశ్వంలో ఒక్క మానవ సమాజం మాత్రమే బుద్ధిగల జీవజాతి అయినప్పటికీ మానవులుగా తమకు తాము సృష్టించుకున్న మతం కులం వర్ణం ప్రాంతం భాష దైవత్వం మరియు మరెన్నో తారతమ్యాల మూలంగా మానవ సమాజమంతా సజాతీయంగా ఐకమత్యంగా జీవించలేక పోతున్నాం. అంటే బుద్ధిలేని ఇతర జీవరాశులను చూసి బుద్ధిజీవి అయినా మానవుడే నేడు సిగ్గు శరం బుద్ధి జ్ఞానం తెచ్చుకోవలసిన పరిస్థితిలోకి మానవ సమాజం నెట్టివేయబడింది.అంతిమంగా వేల లక్షల కోట్ల సంవత్సరాల పాటు మానవ సమాజం మనుగడ కొనసాగించాలంటే వివిధ జీవరాశులలో ఎలాగైతే బ్రతకడం కోసమే మనుగడ కొనసాగిస్తున్నయో మానవుడు కూడా అత్యాశని స్వార్థ బుద్ధిని పక్కకు పెట్టి మానవులుగా మనం సృష్టించుకున్న కుల మత వర్గ ప్రాంత దైవత్వం భాష వివిధ భేదాభిప్రాయాలని పాటించకుండా మానవ సమాజమంతా ఒక్కటేనని బ్రతకడానికి ఇలాంటి తారతమ్యాలు అవసరం లేదు..? అందులో భాగంగానే క్రూరమైన రక్షణ ఆయుధాలు అవసరత కూడా ఉండదు.ఇదంతా నేడు ఆధునిక సమాజంలో సాధ్యమానని ఆలోచిస్తే అసాధ్యంగా అనిపించినప్పటికీ, ఒక్కసారి మానవ పరిణామ క్రమాన్ని, గత చరిత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రాచీన కాలంలో మానవులుగా సృష్టించుకున్న కులం మతం దైవత్వం వివిధ విలువలు లేకపోయినప్పటికీ మానవుడికి ఆనాడు ఉనికి ఉన్నదని చరిత్ర నిరూపిస్తున్నది కానీ నేడు ప్రాచీన కాలం వలె ఆధునిక సమాజంలో మరి అనాగరికంగా జీవించాల్సిన పరిస్థితుల్లో కాకుండా మానవులుగా మనం తయారు చేసుకొనిన విలువలు,ధర్మాలు మానవుని ఉనికికి ప్రయోజనకరంగా ఉండాలి తప్ప, భవిష్యత్తు కాలంలో మానవ మనుగడకే ప్రమాదకంగా మారే మానవ విలువలని విస్మరించి మానవుని ఉనికి ఎల్లకాలం సస్యశ్యామలంగా ఉండే విలువలని సంస్కృతిని ఏర్పాటు చేసుకొని భవిష్యత్ తరాలకి గొప్ప ఆదర్శవంతమైన మార్గాన్ని చూపించాల్సిన సహజమైన బాధ్యత,విధి నేటి ప్రపంచ మానవులందరి పై ఉన్నదనే విషయాన్ని విస్మరించకుండా ఎంతో బాధ్యత యుతంగా జీవించాల్సిన ధర్మం మనందరిపై ఉన్నది.





## హెచ్ఎండీఏ లో గబ్బిలాలు ప్రక్షాళన దిశగా కమిషనర్ సర్ఫరాజ్

**ఏళ్లుగా పాతుకుపోయిన నాన్ క్యాడర్ ఉన్నతాధికారులు**
**వాళ్ళు చేయాలనుకున్నదే ఫైల్, లేకుంటే వెనక్కి తిప్పి ముప్పతిప్పలు**

ప్రజానావ, హైదరాబాద్:

ఎచ్ఎండిఏ లో అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా ఉండే మెట్రోపాలిటన్ అథారిటీకి కొత్త కమిషనర్ గా సీనియర్ ఐఏఎస్ అధికారిని వేశాక అందులో కొంత ప్రక్షాళన జరుగతుంది. ఎన్నో ఏళ్లుగా తిష్ట వేసి అక్రమాలకు ఆలవాలంగా మారిన కొన్ని శాఖలను ఇప్పటికే దుమ్ము దులిపారు. కానీ కొందరు నాన్ క్యాడర్ ఉన్నతాధికారులు మాత్రం కొన్నేళ్లుగా అక్కడే తిష్ట వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఒక నాన్ క్యాడర్ ఉన్నతాధికారి తన దగ్గరకి వచ్చే ఫైల్స్ విషయంలో ఏదైనా ముట్టజెపితేనే ఆ ఫైల్ ముందుకు పోతుంది. లేకుంటే అది తిరిగి మళ్ళీ పై పేషీకి వెళ్ళిపోతుంది. దీంతో ఈ మధ్యే ఎచ్ఎండిఏ కు వచ్చిన ఐఏఎస్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి ఎన్నో ఫైల్స్ పెండింగ్ లో పడి అనుమతులు ఆగిపోయి సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఇదే నాన్ క్యాడర్ ఉన్నతాధికారులు కింది స్థాయి ఉద్యోగులను వర్గాలుగా విభజించి ఎచ్ఎండీఏ లో తాను అనుకున్న ఫైల్ కాకుండా ఇంకే ఏ పని కాకుండా అడ్డుకుంటూ ఉద్యోగుల మధ్య చీలికలు తెస్తూ చేసే పనులను విస్మరిస్తున్నారు. అలా వర్గాలుగా విడిపోయిన ఉద్యోగులు ఉన్నతాధికారులపై లేని పోనీ దుష్ప్రచారాలకు ఒడిగడుతూ తమకు అనుకూలంగా లేని అధికారుల మీద తప్పుడు ప్రచారాలు చేసేలా ఉసిగోలుపుతున్నారు. ప్రభుత్వ ఇతర విభాగాల నుండి ఎవరైనా ఉద్యోగులు ఎచ్ఎండీఏ లో పని చేస్తామని ఆసక్తితో వస్తే వాళ్ళను రానీయకుండా వాళ్ళు ఇచ్చే దరఖాస్తు ఫారాలను మాయం చేస్తున్నారు.

ఎచ్ఎండీఏ సంస్థ టెండర్ల విషయంలో పారదర్శకత లోపించి ఎచ్ఎండీఏ లో ఏళ్లుగా పాతుకుపోయిన నాన్ క్యాడర్ ఉన్నతాధికారులు తమ వాళ్ళకే కట్టబెట్టేలా నిబంధనలు రూపొందించి పై అధికారులను తప్పుదోవ పట్టించి టెండర్ల విషయంలో విపరీతమైన అక్రమాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎచ్ఎండీఏ సెక్రెటరీ చంద్రయ్య అనే అధికారిపై ఎన్నో ఆరోపణలు వచ్చిన కానీ ప్రభుత్వం కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తోంది. ఈ మధ్య ఒక నాన్ రెవెన్యూ ఉన్నధికారి వద్దకు లేఔట్ పర్మిషన్ ఫైల్ రావటంతో ఆ ఫైల్ డ్రాఫ్టింగ్ అన్ని తప్పుడు తడకలుగా రాసి పై అధికారులనే తప్పుదోవ పట్టించి దాన్ని అప్రూవ్ చేసేలా పైఅధికారులను ఒత్తిడి చేయటంతో ఎచ్ఎండీఏ లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి దాన్ని పసిగట్టి ఆ ఫైల్ ను పక్కన పెట్టారు. దాంతో ఆ నాన్ క్యాడర్ అధికారికి కోపం వచ్చి ఉన్నతాధికారులపై లేనిపోని ఆరోపణలు వచ్చేలా తోటి అధికారులను ఉసిగొలుపుతూ తాను పనిచేయకుండా కిందిస్థాయి అధికారులను పనిచేయకుండా తప్పుదోవ పట్టిస్తున్నాడు. అంతేకాకుండా ఎచ్ఎండిఏ లో పనులు సాఫీగా జరిగి వేగవంతం కావటానికి కృషి చేస్తున్న ఐఏఎస్ అధికారుల ఆలోచనలకు తమదైన రాజకీయంతో మోకాలడ్డుతున్నారు. ఎచ్ఎండీఏ సంస్థ ప్లానింగ్ శాఖలో కూడా పరిస్థితులు ఇలానే ఉన్నాయి. ఆ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారి కూడా పై అధికారులకు తెలియకుండా బిల్డింగ్, లేఔట్ అనుమతుల ఫైళ్ల విషయంలో అనేక అక్రమాలకు తెరలేపుతున్నారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఫైళ్లను పక్కదారి పట్టిస్తున్నాడు.



## సమకూరని సమీకృతం

ప్రజానావ, నర్సాపూర్, మెదక్‌టౌన్, తూప్రాన్, రామాయంపేట:

ప్రతి పురపాలికలో సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని నాలుగు మన్సిపాల్టీల్లో పనులు ప్రారంభించారు. వీటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయి. మెదక్, నర్సాపూర్, రామాయంపేటల్లో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఒకేచోట కూరగాయలు, చేపలు, మాంసం, లభించేలా వీటిని నిర్మించాలని సంకల్పించినా, ప్రగతి కనిపించడంలేదు.

**ఎక్కడి పనులు అక్కడే...:**

రామాయంపేట పట్టణంలో రూ.2కోట్లతో రెండేళ్ల కిందట నిర్మాణం ప్రారంభించారు. కొంత పిల్లర్లు, మరికొంత పునాదుల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోడంతో మధ్యలోనే ఆపేశారు. ఆ ప్రాంతంలో పొదలు పెరిగాయి. పట్టణంలో ప్రతి బుధవారం అంగడి రోడ్లపైనే కొనసాగిస్తున్నారు. సిద్ధిపేటరామాయంపేట ప్రధాన రహదారిపై చేపలు విక్రయిస్తున్నారు. ప్రధాన మార్గంలో కూరగాయల అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పడం లేదు.

**అసంపూర్తిగా**

నర్సాపూర్‌లో పాత తహశీల్దార్ కార్యాలయం స్థలంలో రూ.5 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తులో పనులు నిలిచిపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం సైతం కేటాయించారు. ఆకట్టుకునే ప్రవేశ ద్వారం, దుకాణాల ఏర్పాటుకు 8 ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా, అసంపూర్తిగా దర్శనమిస్తోంది.

**వ్యాపారులు ముందుకు రాక..**

తూప్రాన్‌లో నిర్మాణం పూర్తయినా, పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. 85 దుకాణాల్లో 8 మాత్రమే వినియోగంలోకి తెచ్చారు. గతేడాది సెప్టెంబరులో దీనిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇదే పరిస్థితి. మొదటి అంతస్తులో కూరగాయలు, రెండో అంతస్తులో మాంసం, చేపల విక్రయం, మూడో దాంట్లో దుకాణ సముయం ఏర్పాటు చేశారు. మూడు సార్లు టెండర్లు పిలిచినా వ్యాపారులు ముందుకు రాలేదు. ఈ విషయాన్ని మార్కెటింగ్ కార్యదర్శి జాన్‌వెస్లీ వద్ద ప్రస్తావించగా కొత్త దాంట్లో వ్యాపారాలు సాగడం లేదని, కొందరు పాత మార్కెట్ స్థలంలోనే ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.

**పిల్లర్లకే పరిమితం**

మెదక్‌లో నీటి పారుదలశాఖ భవనాల సముదాయంలో రూ.11.50 కోట్లతో పనులు ప్రారంభించారు. అయితే పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. దీనిని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం పెద్దబజార్‌లో కూరగాయల మార్కెట్‌లో రోడ్లపై కూర్చుని అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని డీఈ మహేష్ వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

చిన్న శంకరంపేట మండలం చందంపేట సొసైటీ పరిధిలోని సూరారం, ధర్పల్లి, బాగిర్తిపల్లి, రుద్రారం, చందంపేట గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చందంపేట సొసైటీ చైర్మన్ చింతల సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2,320 రూపాయలు, బీ గ్రేడ్ రకానికి 2,300 క్వింటాలకు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చందంపేట సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ శివకుమార్, సొసైటీ సీఈవో పాషా, పోచగౌడ్, ప్రవీణ్ కుమార్, స్వామి రాజ్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంచనూరి రాజేశ్ జన్మదిన వేడుకలు



**ప్రజానావ, నార్సింగి :**

మెదక్ జిల్లా నార్సింగి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ టెలికం బోర్డు సభ్యులు అంచనూరి రాజేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగర్ల గోవర్ధన్, ఇతర కాంగ్రెస్ నాయకులతో పాటు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావును హైదారాబాద్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజేష్ తన జన్మదిన వేడుకలను హన్మంతరావు సమక్షంలో కేక్ కట్ చేసి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, మండల ఫిషర్‌మెన్ చైర్మన్ సుధాకర్, యాదగిరి, ఎమ్ఎస్ఎస్‌వో నాయకుడు చందూయాదవ్, మోతిలాల్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఉదయం ఆస్పత్రి ఆవరణలో ఓ శవం కాలిపోయి ఉందని స్థానిక వైద్యురాలు సాయి సింధు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సీఐ వెంకటరాజ గౌడ్, తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని, సీసీ కెమెరాలు కూడా పరిశీలిస్తామని, దాని ప్రకారం విచారణ చేపట్టి దోషులను పట్టుకుంటామని తెలిపారు.

# మెదక్ ప్రజల చిరకాల కల నెరవేరింది

- త్వరలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి
- సామాన్య ప్రజలకు కూడా వైద్యం అందించే విధంగా కార్యాచరణ
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మెడికల్ కళాశాల తరగతులను ప్రారంభించిన మంత్రులు









**ప్రజానావ, మెదక్ బ్యూరో:**

మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాల తరగతుల ప్రారంభించడం శుభ పరిణామం అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రం నూతన మెడికల్ కళాశాలలో తరగతులను మంత్రి దామోదర్, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ ఘన స్వాగతం పలికారు. కళాశాలను మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ పర్యవేక్షించారు. అనంతరం మెడికల్ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు మంత్రులు, ఎంపీ అందజేశారు. ఆనందంతో తమ అభిప్రాయాలను మెడికల్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనరసింహ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో తరగతుల ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నామ్స్ స్ట్రీట్‌గా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 8 మెడికల్ కళాశాలలు రావాలని ఎంతో శ్రమించమన్నారు. పది నెలల వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా తనపై పెద్ద బాధ్యత ఉందన్నారు. సామాన్యునికి ఆరోగ్య పరంగా ఇబ్బందులు కలుగకూడదనీ, వైద్యం ప్రజలకు చేరువ చేసేందుకు మరిన్ని వైద్య సదుపాయాలను అందిస్తున్నట్లు తెలిపారు. మెదక్ మెడికల్ కళాశాల కోసం మెడికల్ కళాశాలకు ఇన్స్ఫ్రాట్రక్షర ₹187 కోట్లతో అత్యాధునిక హంగులతో భవనాన్ని నిర్మించాబోతున్నామన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నర్సింగ్, పారా మెడికల్ కళాశాల మంజూరు చేస్తామన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని ఇక్కడ వ్యవస్థ మాత్రమే శాశ్వతమన్నారు. ప్రజలకు వైద్యం, విద్య, సంక్షేమం అందించాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు విస్తరించబడ్డాయని, యాక్సిడెంట్‌ల దృశ్య వైద్యం తొందరగా అందించాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. తెలంగాణలో హైవేలపై 74 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నమన్నారు. జిల్లా ఇన్‌చార్జి మినిస్టర్ కొండా సురేఖ మాట్లాడుతూ మెడికల్ చదువులో చదివిన చదువుకు ప్రాధాన్యత ఉంటుందనీ, మెడికల్ విద్యార్థులు నిత్య విద్యార్థులు ఉంటారన్నారు. వైద్య రంగంలోకి నూతనంగా వస్తున్న విద్యార్థులు నిరుపేదలకు వైద్యం అందించే విధంగా పని చేయాలన్నారు. రాష్ట్రంలో వైద్యం, ఆరోగ్యంపై మంత్రి దామోదర ప్రత్యేక దృష్టి సరిస్తున్నారన్నారు. మెదక్‌లోని మెడికల్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించిన విద్యార్థులు ఉత్తమ డాక్టర్లు గా కావాలన్నారు. మెదక్ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలనీ, మెదక్ మెడికల్ కళాశాల తరగతుల ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్ ఎప్పుడో అభివృద్ధి చెందాల్సిన జిల్లా అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ దేశ వ్యాప్తంగా 327 కొత్త మెడికల్ కళాశాలలు ఇచ్చారన్నారు. దీని ద్వారానే వైద్య విద్యకు మోడీ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారో తెలుస్తుందన్నారు. మెదక్ మెడికల్ కళాశాల కోసం తను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. తెలంగాణకు ఏయిమ్స్ ఇచ్చిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. పేదలకు ఫ్రీగా ఉచిత వైద్యం అందించాలన్నదే మోడీ సర్కార్ లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. మెదక్ మెడికల్ కళాశాల తొందరగా సొంత భవనం నిర్మించి ఇవ్వాలని ఆరోగ్య శాఖ మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చేశారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు మాట్లాడుతూ మెదక్ మెడికల్ కళాశాల తరగతుల ప్రారంభంతో మెదక్ ప్రజల చిరకాలవాంఛ నెరవేరిందన్నారు. నేనూ వైద్యున్ని మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. నేను ఏ పని అయినా మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజానావ, దౌల్తాబాద్ :**

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ ఐకెపీ ఏపీఎం యాదగిరి పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కావున రైతులు దళారుల నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. ఐకేపీ కేంద్రాలను రైతులకు అవసరమైన కనీస వసతులను సమకూర్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన సీఏ లకు సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్న కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, డిప్యుటీ తహశీల్దార్ జాఖిర్, ఏపీఎం యాదగిరి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాలరాజు, సునీత, నాగరాజు, లక్ష్మణ్, వైకుంఠం, కనకరాజు, మహేష్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు సంతోష్, బాపురాజు, సునంద, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## నేల సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలి

### శాస్త్రవేత్త డా. పుష్పజీత్ చౌదరి



**ప్రజానావ, శామీర్‌పేట :**

నేల సారాన్ని బట్టి రైతులు పంటలు వేసుకోవాలని ఇక్రిసాట్ శాత్రవేత్త డాక్టర్ పుష్పజీత్ చౌదరి సూచించారు. ఇక్రిశాట్, లారస్ ల్యాబ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం, కోల్తూర్ గ్రామంలో రైతులకు మట్టి పరీక్షలు నిర్వహించి వాటికి సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లోని మట్టిని పరీక్షించిన తర్వాతే సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలన్నారు. నేల సారాన్ని బట్టి పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. రైతులు తప్పనిసరి తమ పొలంలోని మట్టిని పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్త చేతులమీదుగా హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ విజయ రంగనాథ్, ఇక్రిశాట్, లారస్ ల్యాబ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చేతన నింజ్, లావణ్య, కుసుమ, లక్ష్మణ్ రెడ్డి, మహేంద్ర, సుగుణ, నవీన్, వ్యవసాయాధికారులు ఏడీఏ వెంకట్రాంరెడ్డి, ఏవో రవికుమార్, మాజీ సర్పంచ్ నల్ల శిల్పా, రైతులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించే వ్యక్తిని గెలిపించుకుందాం



**ప్రజానావ, మెదక్ :**

పీఆర్‌టీయూ సంఘం అధికారిక అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మెదక్ జిల్లా కేంద్రం ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ యతరాజు వల్లిని ఉపాధ్యాయ బృందాన్ని కోరిన మెదక్ జిల్లా శాఖ అధ్యక్షులు సుంకరి కృష్ణ కోరారు. వంగ మహేందర్‌రెడ్డి తమ ఫౌండేషన్ ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తిని ఈసారి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ పట్టణ అధ్యక్షులు వీరేశం, హవేలీ ఘనపూర్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పట్టణ, రాష్ట్ర బాధ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# చిరు ప్రాయం చేసిన దోషమేంటి?




వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'డియర్ కృష్ణ'. అక్షయ్ కథానాయకుడు. మమితా బైజు, ఐశ్వర్య కథానాయికలు. దినేశ్‌బాబు దర్శకుడు. పీఎన్ బలరామ్ నిర్మాత. 'చిరు ప్రాయం చేసుకున్న దోషమేంటి దైవమా...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని అగ్ర కథా నాయకుడు మోహన్‌లాల్ విడుదల చేశారు. హరిప్రసాద్ స్వరకల్పనలోని ఈ పాటని, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించగా, గిరిపట్ల రచించారు. "నిజంగా జరిగిన ఓ అద్భుతం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఆ అద్భుతానికీ, శ్రీకృష్ణుడికీ సంబంధమేమిటన్నది ఆసక్తికరం. 'చిరు ప్రాయం...' పాటకి మంచి స్పందన లభిస్తోంది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చివరిగా పాడిన పాట ఇదే" అని సినీ వర్గాలు తెలిపాయి.



# మీనాకుమారిగా కియారా?

అద్భుతమైన నటనతో పరిశ్రమలో మంచి గుర్తింపు, గౌరవాన్ని సొంతం చేసుకున్న దివంగత నటి మీనా కుమారి బయోపిక్‌లో కథానాయిక కియారా అద్వాణీ కనిపించనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. సిద్ధార్థ్ పి. మల్హోత్రా దర్శకత్వంలో మీనా కుమారి జీవితం ఆధారంగా 'కమల్ ఔర్ మీనా' అనే చిత్రం రూపొందుతున్నట్లు ఇటీవలే ప్రకటించింది చిత్రబృందం. ఇందులో కృతి సనన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె స్థానంలో కియారాను ఎంపిక చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. మీనా ప్రేమకథలోని కొన్ని సంఘటనల ఆధారంగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కియారా సైతం నటించడానికి ఉత్సాహంగా ఉన్నట్లు, త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కియారా జాబితాలో 'డాన్ 3', 'వార్ 2' చిత్రాలున్నాయి.

# అలాంటి పేర్ల నుంచి బయటపడాలి!



"ఇటీవలే చిత్రపరిశ్రమకు వచ్చి దశాబ్దం పూర్తి చేసుకున్నాను. ఎప్పుడూ నటిగానే పరిమితం కాకుండా ఏదైనా కొత్తగా చేయాలని మొదటి నుంచే అనుకునే దాన్ని. ఏ పని చేస్తే బాగుంటుంది? ఎలాంటి పాత్ర పోషిస్తే అందరికీ నచ్చుతుంది? అని ఆలోచించేదాన్ని. వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందుకుంటూ నెమ్మది నెమ్మదిగా నాలో ఉన్న నైపుణ్యాలని ఎలా మెరుగు పరుచుకోవాలో అర్థం చేసుకున్నాను. చిత్ర పరిశ్రమకు వచ్చిన కొత్తలో ఎవ్వరికీ అంత తొందరగా అవకాశాలు రావు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సమయం, విజయం, అనుభవంతోనే మీకు అవకాశాలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో అవకాశాల్ని మనమే సృష్టించుకోవాల్సి వస్తుంది. 'దో పత్తి'తో వచ్చిన అవకాశంతో నటిగానే కాకుండా నిర్మాతగా నిరూపించుకోవాలనుకున్నాను".

**ద్విపాత్రాభినయం ఊహించలేదు..**

"నేను నిర్మాతగా మారడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ఇప్పటి వరకూ నేను పోషించని పాత్రల్ని సినిమాల్లో సృష్టించుకునే స్వేచ్ఛ నాకు ఉంటుంది. రెండోది ప్రస్తుతం చిత్రపరిశ్రమలో మహిళా ప్రాధాన్య కథలపై ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదు దర్శక నిర్మాతలు. ఇలాంటి సమయంలో నేను ఒక నిర్మాతగా ప్రపంచానికి తెలియని కొత్త కొత్త కథలపై దృష్టిపెడుతూ ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకుంటున్నాను. 'మిమీ' తర్వాత నేను లోతైన పాత్రల్లో నటించాలని కోరుకున్నాను. కానీ అస్సలు అలాంటి పాత్రలు మహిళల కోసం రాయట్లేదు. కనికా భిన్నమైన కథలను, పాత్రలను రాస్తుంది కాబట్టి నేను ఆమెతో పనిచేయాలని అనుకుంటున్నానని చెప్పాను. 'దో పత్తి' సినిమాలో నటించడానికి కూడా ఇదే ముఖ్య కారణం. కనికా ఇందులో నన్ను ద్విపాత్రాభినయంలో శక్తిమంతంగా చూపిస్తుందని ఊహించలేదు".

**నన్ను నేను నిరూపించుకోవాలని**

"టైగర్ ష్రాఫ్‌తో కలిసి నటించిన 'హీరో పంతి'తోనే బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యాను. నేను సినీ కుటుంబానికి చెందిన అమ్మాయిని కాదు. కానీ అప్పటికే టైగర్ అందరికీ సుపరిచితం. ఆ సినిమా విడుదలైన రోజుల్లో అభిమానులు నన్ను గుర్తుపట్టడానికి 'టైగర్ ష్రాఫ్ సినిమాలో కనిపించిన అమ్మాయి' అని పిలిచేవారు. మీరు పరిశ్రమకు చెందిన వ్యక్తి కానప్పుడు మీ పేరు, ముఖాన్ని ప్రజల మనసుల్లో చెక్కడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీంతో పాటు మరికొంత మంది నన్ను 'టైగర్ దీదీ' అని పిలిచేవారు. ఇలాంటి పేర్ల నుంచి బయటపడాలని.. నేనెవరో వారు తెలుసుకునేలా చేయడానికి ఎక్కువ కష్టపడి నన్ను నేను నిరూపించుకోవాలని నిర్ణయించుకున్నాను".

**పదేళ్ల తర్వాత లోతు తెలిసింది**

"ఇప్పటి వరకూ ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాను. అద్భుతమైన నటులతో, అనుభవమున్న దర్శకులతో పనిచేశాను. కానీ.. నేను ఛాలెంజింగ్ పాత్రలో నటిస్తేనే.. సెట్‌లో ఉత్సాహంగా ఉంటాను. ఎప్పుడెప్పుడు వెళ్లి నా పాత్రకు సంబంధించిన సన్నివేశాన్ని పూర్తి చేస్తానా అని ఆత్రుతగా ఎదురు చూస్తుంటాను. కొన్నిసార్లు సవాలు లేని పాత్రలు చేయాల్సి వస్తుంటుంది. అప్పుడు నేను సెట్‌లో ఉత్తేజంగా ఉండలేను. నిద్రపోవాలనిపిస్తుంది. ఇలాంటి పాత్రలతో నేను సంతృప్తి కూడా చెందలేను. మొదట్లో ఎలాంటి పాత్రల్ని ఎంచుకోవాలో కనీసం అవగాహన లేదు. ఇప్పుడు పదేళ్ల తర్వాత నేను పాత్రల లోతును, కథను అర్థం చేసుకొని ఎంచుకునే స్థాయికి చేరుకున్నాను".

# ఆ బాధ్యతతో చేసిన చిత్రమే కంగువా



"తెలుగు ప్రేక్షకులతో నాకున్న అనుబంధం చాలా ప్రత్యేకమైనది. థియేటర్‌లో నా సినిమా విడుదలై రెండేళ్లుపైనే అయ్యింది. ఎంతో ప్రేమని కురిపిస్తున్న ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభవాన్ని ఇవ్వడం నా బాధ్యత. అందుకే 'కంగువా' చేశా" అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా... శివ తెరకెక్కించిన చిత్రం 'కంగువా'. దిశా పటానీ, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. స్టూడియో గ్రీన్, యు.వి.క్రియేషన్స్ కలిసి రూపొందిస్తున్న ఈ చిత్రానికి కె.ఇ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. నవంబరు 14న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్లతో సమావేశమైంది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ "దర్శకుడు శివ ఈ కథ చెప్పినప్పుడు లేచి గట్టిగా హత్తుకున్నా. ఇలాంటి భారీ కథలు చేయాల్సి వచ్చినప్పుడు మొదట భయమేస్తుంది. కానీ 27ఏళ్ల అనుభవం ఉన్న నేను వెనకడుగు వేస్తే అర్థం ఉండదు. ఇలాంటివి డబ్బు కోణంలో ఆలోచించకుండా, తపనతో చేయాల్సిన సినిమాలు. 'బాహుబలి', 'కాంతార', 'ఆర్ఆర్ఆర్' లాంటి సినిమాలు ఇలా ఆలోచించి అడుగు వేసినప్పుడే సాధ్యమవుతాయి. హాలీవుడ్ నుంచి 'బ్రేవ్ హార్ట్', '300' తదితర చిత్రాలు చూసినప్పుడు మనమెప్పుడు చేస్తాం అనుకునేవాళ్లం. అలాంటి సినిమాలకి గేట్లు ఓపెన్ చేసిన దర్శకుడు రాజమౌళికి కృతజ్ఞతలు. ప్రాంతీయ సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లొచ్చని ఆయన దారి చూపించారు. నవంబరు 14న ప్రత్యేకమైన అనుభవాన్ని పంచుతుందీ చిత్రం. ఈ కథ ఫైటర్ గురించి కాదు, వారియర్ గురించి" అన్నారు. దర్శకుడు శివ మాట్లాడుతూ "ఇదివరకు చారిత్రక చిత్రాలు చాలా వచ్చాయి. వాటికి భిన్నంగా 1500 ఏళ్ల కింద అప్పటి ప్రపంచంలో ఉన్న మనుషులు, వాళ్ల భావోద్వేగాలపై సినిమా చేద్దామనుకున్నాం. ఆ ఆలోచనే నాకు కొత్తగా అనిపించింది. ఐదు వంశాల చుట్టూ సాగే చిత్రమిది. పెద్ద కాన్వాస్ చిత్రాలకి, బలమైన మానవీయ భావోద్వేగాలు కూడా తోడైతే చాలా బాగుంటుంది. విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగాల విషయంలో రాజమౌళిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేశాం" అన్నారు. నిర్మాత కె.ఇ.జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ "కంగువా' అందరికీ వినోదం పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో పంపిణీదారుడు శశి, రచయిత రాకేందుమౌళి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657